క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటా

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని తాటిపల్లి గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళి వివరాలను స్థానిక నాయకులకు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న క్రాంతి కిరణ్

వట్‌పల్లి(అందోల్): అందోల్ నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆయన స్వగ్రామం మండల పరిధిలోని పోతులబోగుడా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు.

ఇద్దరికి గాయాలు..



గాయపడిన వృద్ధుడు

మునిపల్లి(అందోల్): అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. గురువారం మండలంలోని అంతారం, మునిపల్లి, మేళసంగ్యం గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ జరిగినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పెద్దగోపులారం గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు కేంద్రం వద్ద గుమ్మిగూడారు. కేంద్రం నుంచి దూరంగా వెళ్లాలని పోలీసులు హెచ్చరించినా వినకపోవడంతో వారు లాఠీలకు పని చెప్పారు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి.

ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిట



టాప్‌పై కూర్చుని ప్రయాణిస్తూ..

ఝరాసంగం(జహీరాబాద్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. శాసనసభ ఎన్నికలు గురువారం జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు ఓటువేసేందుకు రాకపోకలు సాగించారు. దీంతో ప్రైవేటు వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు సైతం కిక్కిరిసిపోయాయి. జహీరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓటు వేసేందుకు టాప్‌పై ప్రయాణించాల్సి వచ్చింది.

సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామశివారులో స్వయంభూగా వెలసిన శ్రీసిద్ధి వినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. నెలకోమారు వచ్చే సంకష్టహర చతుర్థినాడు స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. జిల్లాలోని నలు మూలల నుంచే కాకుండా సమీప కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్టు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని ముంగి గ్రామంలో శాసనసభ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పథకాల వల్ల ప్రతీ కుటుంబం లబ్ధి పొందిందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి మంచి స్పందన వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు గెలుపొందడం ఖాయమన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్



ఝరాసంగంలో ఓటు హక్కు వినియోగించుకున్న యువత



రామచంద్రాపురంలో ఓటువేసిన భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

ఉత్సాహంగా ఓట్ల పండగ

- ఓటు వేసేందుకు కేంద్రాలకు తరలివచ్చిన ఓటర్లు
- ఉత్సాహంగా తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువత



జిన్నారం: గుమ్మడిదలలో ఓటు వేసిన యువతులు



పటాన్ చెరు డివిజన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో గురువారం వివిధ పార్టీల నాయకులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఆయన సతీమణి లక్ష్మీప్రసన్నతో కలిసి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అమీన్‌పూర్‌లో ఓటు వేశారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని శ్రీవాణి స్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

బారులు తీరిన ఓటర్లు

కల్హేర్(నారాయణఖేడ్): అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట మండలాల్లో ఓటర్లు బారులు తీరారు. కల్హేర్ మండలం ఖానాపూర్(కె)లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎం.భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోస్తు ఏర్పాటు చేశారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. వృద్ధుల సైతం ఉత్సాహంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సమయం ముగిసే చివరి సమయంలో పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఓటింగ్ సమయం ముగియడంతో అధికారులు గేట్లు మూసి వేశారు. ఆ సమయంలో ఆవరణలో ఉన్నవారు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కేంద్రాలకు తరలివచ్చి..

ఝరాసంగం(జహీరాబాద్): శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం మండలం కేంద్రమైన ఝరాసంగం తో పాటు వివిధ గ్రామాల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి తరలివచ్చారు. ఝరాసంగంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కె.మాణిక్ రావు కుటుంబ సభ్యులు, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సునీతా పాటిల్, ఈదులపల్లి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్, ఎల్గోయి గ్రామంలో సీడీసీ చైర్మన్ ఉమా కాంత్ పాటిల్, కాంగ్రెస్ టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు గ్రామాల్లో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఓటు హక్కును వినియోగించుకున్న నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు.

ఓటర్ల జాబితాలో పేరులేక..

కోహీర్(జహీరాబాద్): మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని బడంపేట గ్రామంలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కోహీర్ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం వెలుతురు లేక ఓటర్లు కొద్ది సేపు ఇబ్బందిపడ్డారు. చింతల్‌ఘాట్ గ్రామానికి చెందిన 14 మంది ఓట్లు ఝరాసంగం మండలం ఏడాకులపల్లి ఓటర్ జాబితాలోకి వెళ్లడంతో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వారు ఆ గ్రామానికి వెళ్లవలసి వచ్చింది. చింతల్‌ఘాట్ గ్రామానికి చెందిన ఆరు ఓట్లు కొత్తూర్(డి) ఓటర్ల జాబితాలోకి వెళ్లాయి. బడంపేట గ్రామానికి చెందిన రెండు ఓట్లు మనియార్‌పల్లి ఓటర్ల జాబితాలోకి, మరో ఓటు కోహీర్ జాబితాలోకి, గొటిగార్‌పల్లి గ్రామానికి చెందిన ఒక ఓటు బడంపేట ఓటర్ల జాబితాలోకి వచ్చింది.

పలు బూత్‌లలో..

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలో గురువారం స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సదాశివపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, ఆయన సతీమణి చింతా అరుణ, బీజేపీ అభ్యర్థి పులిమామిడిరాజు, ఆయన భార్య, స్వతంత్ర అభ్యర్థి తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 196, 199, 198 పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందిపడ్డారు.

వాహనాల్లో తరలివచ్చి..

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గం నుంచి వలస వెళ్లిన ఓటర్లు ఓటువేసేందుకు తమ స్వగ్రామాలు, తండాలకు తరలివచ్చారు. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రవేటు వాహనాల్లో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో..

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. మహిళలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో ఓటింగ్ కేంద్రాలకు ప్రజలు తరలివచ్చి గంటల తరబడి క్యూలో నిలుచున్నారు. పలు కేంద్రాల్లో ఓటింగ్ ఆలస్యం కావడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. మండలంలోని అల్గోల్ గ్రామంలో పోలింగ్ నిలకడగా సాగడంతో ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్లీపూర్‌లోని పలు బూత్‌లలో తగినంత వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు లేవని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. రంజోల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్‌బూత్‌ను జనరల్ అబ్జర్వర్ పవన్‌కుమార్ పరిశీలించారు.

రాత్రి వరకు పోలింగ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో గురువారం నిర్వహించిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని ఇబ్రహీంపూర్, మల్గి గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటువేసేందుకు ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. అధిక శాతం మహిళలు ఉదయం పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వృద్ధులు, వికలాంగుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా దివ్యాంగుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉండగా మండలంలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఎస్ఐ రామానాయుడు, పోలీస్ అధికారులు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

కేంద్రాల వద్ద బారులు తీరి..

నారాయణఖేడ్: నియోజకవర్గంలో స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 5గంటల వరకు 75.34 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలకంటే 8.97 శాతం తక్కువ నమోదైంది. నారాయణఖేడ్ మండలం తుర్కాపల్లి స్కూల్ తండాలో సాయంత్రం 6గంటల వరకు కూడా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్‌లో ఎన్నికల బందోబస్తు కోసం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పోలీసులను రప్పించారు.



పటాన్ చెరులో ఓటుహక్కు వినియోగించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, కుటుంబ సభ్యులు



రంజోల్‌లోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ పవన్‌కుమార్



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పోలింగ్ కేంద్రంలో సమయం దాటినా క్యూలో ఉన్న ఓటర్లు



బడంపేటలో బారులు తీరిన ఓటర్లు



జహీరాబాద్‌లో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది



దోవూర్‌లో మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకున్న యువత



నారాయణఖేడ్ వాహనంలో వస్తున్న ఓటర్లు



ఇబ్రహీంపూర్‌లో తొలిసారి ఓటేసిన శారద

పోటెత్తిన ఓటర్లు

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి ఉదయం నుంచే బారులు తీరారు. గ్రామాల్లో కొత్త ఓటర్లు కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పుల్‌కూర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సందర్శించారు. బూత్ సిబ్బందిలో ఓ వ్యక్తిని ఆయన మందలించారు. పోలింగ్ కేంద్రంలో పార్టీల సింబల్ పేరు చెప్పడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లిలో చివరి క్షణంలో పోలింగ్ సిబ్బంది జై కేసీఆర్ నినాదాలు చేయడంతో స్థానికంగా ఉద్రిక్త నెలకొంది. బాదల్‌గాంలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఈవీఎంల మొరాయింపు



నారాయణఖేడ్: గంట ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైన తుర్కాపల్లి పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు

- స్వల్ప ఘటనలు మినహా అంతటా ప్రశాంతం
- సాంకేతిక లోపంతో పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- బొల్లారం, గుమ్మడిదలల్లో నాయకుల వాగ్వాదం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాలల్లో స్వల్ప ఘటనలు మినహా గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బొల్లారంలో మున్సిపల్ పరిధిలో భారీ సంఖ్యలో ఓటు వేసేందుకు కార్మికులు, ఓటర్లు బారులు తీరారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి ఓట్లు రిగ్గింగ్ చేస్తున్నారని బీఎస్పీ నాయకులు ఆరోపించటంతో ఇరు వర్గాలమధ్య వాగ్వావాదం జరిగింది. పోలీసులు, అధికారులు కల్పించుకొని ఇరువురుని శాంతింప జేశారు. గుమ్మడిదల మండలంలోని మంబాపూర్‌లో ఉదయం 3 గంటల పాటు ఈవీఎం మొరాయించటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుమ్మడిదలలో ఓటర్లవద్దకు వెళ్లి ఓటు వేయాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చెబుతుండటంతో కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వావాదం జరిగింది. బొల్లారం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఓటింగ్ సరళిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు సుధా పరిశీలించారు.

వెలుతురు సరిగాలేక..

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ పోలింగ్‌లో సాంకేతిక లోపంతో ఈవీఎంలు మొరాయించాయి. ఖేడ్ మండలం జూకల్‌లోని 250వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 7.45గంటలకు, తుర్కాపల్లిలో అర్ధగంట ఆలస్యంగా ప్రారంభమయ్యింది. నారాయణఖేడ్‌లోని 180వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంను తలకిందులుగా తిప్పి పెట్టడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. 75 ఓట్లు పోలయ్యాక అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సరిదిద్దారు. మంగల్‌పేట్ యూపీఎస్‌లోని పోలింగ్ బూత్ వద్ద వెలుతురు సక్రమంగా లేకపోవడంతో ఓటర్లు బ్యాలెట్ బాక్సుపై గుర్తులు సక్రమంగా కన్పించలేదన్నారు.

పెద్దశంకరంపేట మండలంలో..

పెద్దశంకరంపేట మండలం శివాయపల్లిలోని 127వ బూత్‌లో గంటసేపు ఈవీఎం మొరాయించింది. కంగ్టి మండలం డి.బాన్సువాడలోని 54వ పోలింగ్ బూత్‌లో గంటన్నరపాటు ఈవీఎం మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది.

దేవులపల్లిలో..

హత్నూర(సంగారెడ్డి): మండలంలో శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 38 గ్రామపంచాయతీలలో 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేవులపల్లి గ్రామంలో 45 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించడంతో కొంత ఇబ్బంది తలెత్తింది. వడ్డేపల్లి గ్రామంలో ఉదయం ఓటింగ్ ప్రారంభం కాగానే నాలుగు ఓట్లు వేయగానే ఈవీఎం మొరాయించడంతో మరొకటి ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలతో ఎస్ఐ సుభాష్ పర్యవేక్షించారు. వృద్ధులు సైతం కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. హత్నూరలో పోలీసుల లాఠీచార్జి తప్ప ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి స్వగ్రామమైన మండలంలోని మంగాపూర్ గ్రామంలో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.



30జెజెపి82: గొర్రెకల్‌లో బారులు తీరిన ఓటర్లు



కల్హేర్: ఖానాపూర్ (కె)లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్ రెడ్డి



న్యాల్‌కల్‌లో ఓటింగ్ సరళని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

స్వల్ప ఉద్రిక్తత

నారాయణఖేడ్: ఖేడ్ మండలం పిప్రిలోని పోలింగ్ బూత్ వద్ద వృద్ధురాలికి సహాయకులుగా ఓటు వేయడానికి వెళ్లే విషయంలో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద ఒకేఒక్క కానిస్టేబుల్ ఉండటంతో ఘర్షణకు దిగారు. నారాయణఖేడ్ పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితి చక్కదిద్దారు. కొండాపూర్ తండా పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ ముగిసే సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకోగా ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలను కేంద్రం నుంచి పంపించారు.

బీఆర్‌ఎస్ విజయం పక్కా

జోగిపేట(అందోల్) : తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని, సీఎం కేసీఆర్‌ మరోసారి బంపర్ మెజార్టీతో హ్యాట్రిక్ సాధించ బోతున్నారని అందోల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనరసింహ ఓటమి భయంతో ఎత్తుగడతో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించే చేశాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తన అభ్యర్థిత్వాన్ని ఈసీ రద్దు చేసిందని, తనపై ఈసీ వెయిట్ వేసిందంటూ తప్పుడు వీడియోలు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసేలా దామోదర్ తన అనుచరులను ప్రోత్సహించాడని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలు

కోహీర్(జహీరాబాద్): ఓటింగ్ సరళి తీరు గమనిస్తే కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలు కనిపిస్తున్నాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రమైన కోహీర్‌లో పోలింగ్ ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి స్పష్టమైన అధిక్యత కనిపిస్తుందన్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు, ఓటు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వెంకటనర్సింహారెడ్డి దేశ్‌ముఖ్, మాజీ కోఆప్షన్ సభ్యులు అశ్రఫ్ అలీ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముర్తుజా హుసేన్ పటేల్, రహమత్ అలీ పాల్గొన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

సంగారెడ్డి: 40 రోజులుగా రేయింబవళ్లు పార్టీ గెలుపు కోసం పనిచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు టీఎస్ ఎంబీడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ మంచి మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు.

రాంరెడ్డిపేటలో రాత్రి వరకు పోలింగ్



రాంరెడ్డిపేటలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో కూర్చున్న ఓటర్లు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం రాంరెడ్డిపేటలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు భారీగా బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో నిలుచున్నారు. దీంతో ఎన్నికల అధికారులు ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వడంతో ఓటుహక్కు వినియోగించుకున్నారు.